ఉగ్రవాదంపై తిరుగుబాటు సమీక్షకు హాజరైన అనిత

విశాలాంధ్ర - నక్కపల్లి: ఢిల్లీ కేంద్రంగా ఉగ్రవాదంపై తిరుగుబాటు అనే సమీక్ష కార్యక్రమానికి ఆంధ్ర రాష్ట్రం నుంచి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు వివరాలను వెల్లడి చేశారు. ముందుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సమీక్షకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆంధ్ర రాష్ట్రంకు సంబంధించిన పలు విషయాలను మాట్లాడారు.

రండి...బాబూ...రండి

ఇసుక అక్రమ తవ్వకాలకు వేలం పాట

రామాలయ కమిటీ పేరుతో అక్రమ వసూళ్లు

పంచాయతీ, పోలీసుల కనుసన్నల్లోనే వ్యవహారం

విశాలాంధ్ర - అనకాపల్లి: ఇసుకాసురులు తమ అక్రమ తవ్వకాలకు పదును పెట్టారు. ప్రభుత్వం మారిందే తడువుగా గడిచిన మూడు నెలల నుంచి అక్రమంగా ఇసుకను తవ్వుతూ తరలించుకుపోతున్నారు. పోలీసులు మాత్రం ఏమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. అటు పోలీసులు ఇటు పంచాయతీ మరోవైపు రెవెన్యూ శాఖల కనుసన్నల్లోనే మొత్తం ఇసుక అక్రమ దందా నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గడిచిన ఐదేళ్లుగా ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఉక్కు పాదం మోపారు. దీంతో ఇసుకాసురులు అన్ని మూసుకొని కూర్చున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎడాపెడా ఇసుక అక్రమ రవాణా చేసి దోచుకోవాలని ఆలోచనతో బరితెగించి పెద్దపెద్ద మిషన్లతో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇసుకా సురులు సమన్వయంతో సర్దుకుపోతున్నారు. అంతేకాకుండా గడిచిన కొద్ది రోజుల క్రితం అనకాపల్లి మండలంలోని వెంకుపాలు, సీతానగరం, తగరంపూడి, దిబ్బపాలెం, చోడవరం మండలం ముద్దుర్తి పంచాయతీ పరిధిలో ఇసుకను అక్రమంగా తవ్వి తరలించడానికి వేలంపాటలు కూడా నిర్వహించినట్లు సమాచారం. ఈ వేలం పాటల నిర్వహణలో ఆ గ్రామాల రామాలయ కమిటీ ముఖ్యపాత్ర పోషించినట్లు తెలుస్తుంది. రామాలయాల అభివృద్ధి, గ్రామంలో జరిగే పండగలకు పబ్బాలకు అక్రమ ఇసుక తరలింపు ద్వారా వచ్చే నిధులనే ఉపయోగిస్తారని అందుకోసమే రామాలయ కమిటీ ఆధ్వర్యంలోనే ఇసుక అక్రమ తరలింపు వేలం పాటలు నిర్వహించారని తెలిసింది. వెంకుపాలెంలో ఇసుక తరలిం పునకు ఎంపీటీసీ సభ్యుడు 10 లక్షలకు వేలం పాటను దక్కించుకోగా సీతానగరంలో అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన మహేష్, రవి ఐదు లక్షలకు వేలంపాటను దక్కించుకోగా తగరంపూడిలో అధికార పార్టీ నాయకులే 5 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నట్లు తెలిసింది. అలాగే దిబ్బపాలెం పంచాయతీలో ఇసుక అక్రమ తరలింపునకు (ఆశీల ముసుగులో) 10 లక్షలకు కూటమి పార్టీలకు చెందిన రోహిత్ అనే యువకుడు వేలంపాటను దక్కించుకొని ఇప్పటికే దందాను మొదలుపెట్టినట్లు తెలిసింది. ఏ గ్రామంలోకి వెళ్లి ఏ వ్యక్తిని అడిగినా పైన చెప్పిన విషయాలు చాలా స్పష్టంగా వివరిస్తారు. కానీ పోలీసులకు తెలియకపోవడం, నిత్యం పంచాయతీలో ఉండే కార్యదర్శులకు ఈ విషయాలు తెలియకపోవడం చూస్తే వీరి సహకారం రామాలయ కమిటీ ముసుగులో సాగిస్తున్న ఇసుక దందాకు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాస్థాయి అధికారులైనా స్పందించి సదరు వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వ నాయకులే కోరుతున్నారు.

పెన్సిల్ ముల్లుతో ఎయిర్ క్రాఫ్ట్

విశాలాంధ్ర - నక్కపల్లి: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా సూక్ష్మ కళాకారుడు గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత మండలంలోని చిన్నదొడ్డిగల్లుకు చెందిన డాక్టర్ గెట్టం వెంకటేష్ పెన్సిల్ ముల్లుతో ఎయిర్ క్రాఫ్ట్ తయారు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఈ పెన్సిల్ ముల్లుతో ఎయిర్ క్రాఫ్ట్ తయారు చేయడానికి మూడు గంటలు పట్టిందని, చార్కల్ పెన్సిల్ 18 (ఎంఎం) పొడవు, ఎనిమిది (ఎంఎం) వెడల్పుతో తయారు చేయడం జరిగిందని చెప్పారు. వెంకటేష్ తయారుచేసిన ఎయిర్ క్రాఫ్ట్ పలువురిని ఆకర్షించింది.

మహా చండీ దేవిగా శ్రీ కనకదుర్గ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఆవరణలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో నిర్వహిస్తున్న దుర్గ శరన్నవరాత్రుల్లో ఐదవ రోజు సోమవారం శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారు మహా చండీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం వేకువజాము నుండి అమ్మవారికి శ్రీ సూక్త విధానంలో పంచామృతములతో అభిషేకం, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు, సహస్ర పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు, భక్తులచే పూజలు అనంతరం చండీ హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.శివ కుమార్ శర్మ తెలిపారు. మహిళలచే సామూహికంగా లలితా సహస్ర నామాలు, దుర్గ సప్తశతి పారాయణం చేయిస్తున్నారు.

పండగ పూటైనా జీతాలు ఇప్పించండి

విశాలాంధ్ర - యలమంచిలి: జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, కార్మికులకు బకాయి పడ్డ జీతాలు దసరా పండగలోగా ఇవ్వాలని కార్మికులు వేడుకున్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి చేస్తున్న నిరసన సోమవారం నాటికి 47వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని కాంట్రాక్టర్లను అడిగితే ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని జీతాలు చెల్లించ లేమని కుంటి సాకులు చెప్తున్నారని వాపోయారు. ఒక్కనెల ఇంటిఅద్దె, కిరణా, అప్పులకు వడ్డీలు, పిల్లలు స్కూల్ ఫీజులు కట్టకపోతే సంబంధిత యాజమా న్యాలు తమపై ఒత్తిడి చేస్తున్నారని, అలాంటిది మూడు నెలలు జీతాలు బకాయిలు ఉంటే ఏం తిని బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్ట్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు ఈ నెల 16వ తేదీ లోపల పరిష్కారం కాకుంటే సమ్మె తప్పదని దీనికి అధికారులు బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో తాటిపాకల చిన్న అప్పారావు, మడక శ్రీనివాస్, అనిల్ శ్రీనివాస్, సంతోషి, రత్నం, రమణమ్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

విశాలాంధ్ర - రావికమతం: జెడ్.కొత్తపట్నం వీఆర్వో బుంగా శ్రీనివాసరావు గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. కొత్తకోట గ్రామానికి చెందిన బుంగా శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ప్రతిరోజు మాకవారిపాలెం మండలం కొండల అగ్రహారం విధులకు వెళ్లి వస్తూ ఉండేవాడు. తాజాగా ఈయనకు జెడ్.కొత్తపట్నం బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య ఇరువురు పిల్లలు ఉన్నారు. సోమవారం ఉదయం సహచర ఉద్యోగులు మృతుని పార్థివ దేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే కొంత మొత్తంలో ఆర్థిక సహాయం కూడా అందజేశారు.

రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా బోడపాటి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - నక్కపల్లి: రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్తు రాష్ట్ర కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ తోట సుధీర్‌తో పాటు డైరెక్టర్‌గా శివ దత్తు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శివ దత్తు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చైర్మన్ సుధీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి అవకాశం కల్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

నునపర్తిలో బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

విశాలంధ్ర - అచ్యుతాపురం: నునపర్తిలో విశాఖ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ నిర్వహణలో మూడు రోజులపాటు నిర్వహించిన 9వ ఆంధ్ర రాష్ట్ర జూనియర్ అండర్ 19 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. సుమారుగా 13 జిల్లాల నుండి బాలురు, బాలికల జట్లు పాల్గొన్న ఫైనల్స్‌లో విశాఖ జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై గెలిచి ప్రథమ స్థానం సాధించింది. అదేవిధంగా విశాఖ జిల్లా బాలికల జట్టు తూర్పుగోదావరి జిల్లా జట్టుపై ఫైనల్స్‌లో గెలిచి ప్రథమ స్థానం సాధించింది. డిసెంబర్లో జరిగే జాతీయస్థాయి పోటీలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ జట్లను రాష్ట్ర సంఘం కార్యదర్శి ఆర్.వెంకట్రావు ప్రకటించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు పైలా సన్నీ బాబు (స్పెషల్ మెట్రో పాలిటిన్ రిటైర్డ్ జడ్జ్), ఉత్తరాంధ్ర బీసీ సంఘం అధ్యక్షులు నరవ రాంబాబు, బాల్ బ్యాడ్మింటన్ అఖిలభారత సమాఖ్య జనరల్ సెక్రటరీ వై.రాజారావు, రాష్ట్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై.విజయ శంకరరెడ్డి, ఆర్.వెంకట్రావు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఆర్‌వివి నగేష్, పరవాడ మండల పరిషత్ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.ప్రభూజి, ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపూడి శంకర్రావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యులు, జిల్లా సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా నరసింహారావు

విశాలాంధ్ర - కశింకోట: తెలుగునాడు జిల్లా ప్రభుత్వ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా కే.ఎస్.అర్.కె.జీ నరసింహారావు(శివ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది జిల్లాలో ఉన్న వైద్య సిబ్బంది నరసింహారావును సోమవారం పలువురు అభినందించారు. నరసింహారావు తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్‌గా విశేషంగా సేవలను అందించడమే కాకుండా, పలువురికి ఆదర్శంగా ఉంటున్న విషయం అందరికి తెలిసిందే. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను అందించే విధంగా కృషి చేసి, సంఘానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తానని చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర నాయకత్వానికి ఆయన అభినందనలు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం చోద్యం బొడ్డేరు వాగుపై ఉన్న వంతెన సమీపంలో నుండి ఇసుకను తరలించకుండా నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ ఆదేశాలతో కేడీపేట ఎస్సై టి.దివ్య జేసీబీతో రహదారులను గోతులు తవ్వించారు. చోద్యం వంతెన సమీప నుండి నిత్యం నాటు బళ్ళు ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తున్నారని వాటిని అరికట్టేందుకు ఈ విధంగా రహదారిని గోతులు తీయించడం జరిగిందని ఎస్సై తెలిపారు. జేసీబీతో తీయించిన గోతులను పూడ్చివేసి ఇకపై నాటు బళ్ళు టాక్టర్లతో ఎవరైనా ఇసుకను తరలించినట్లయితే అలాంటి వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సెయిల్‌లో కలిపితేనే స్టీల్‌ప్లాంట్‌కు పరిష్కారం

సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సాగి విశ్వనాథ్ రాజు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సెయిల్‌లో కలిపితేనే స్టీల్‌ప్లాంట్ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం ఉంటుందని, ఈ విషయాన్ని ఉక్కు మంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళామని సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సాగి విశ్వనాథ్ రాజు తెలిపారు. విశాఖ బిజెపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యపై ఎంపిలు, ఎమ్మెల్యేలతో నారా లోకేష్ సమీక్ష ఏర్పాటు చేసి సెయిల్ సభ్యునిగా హాజరైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు అంతా కలిసి సెయిల్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ విలీనమే తీర్మానించారన్నారు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ కలిపితే ఉక్కు టన్నుకు 10వేలు తగ్గుతుంది అన్నారు. సంవత్సరానికి ఒక బొగ్గు విషయంలో 1200 కోట్లు అదనంగా చెల్లిస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సమితి ఉద్యమం అభినందనీయమని, ఎక్కడ ఉత్పత్తికి విఘాతం కలగకుండా ఉద్యమాన్ని చేస్తున్నారన్నారు. సెయిల్‌లో ఉన్న పాలసీ స్వల్ప మార్పు చెయ్యాల్సి వుందన్నారు. ఢిల్లీలో స్టీల్‌ప్లాంట్ మీద కీలక సమావేశం ఉందని, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు మధ్య జరిగే సమావేశం కీలకంగా వుంటుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం సిఎం చంద్రబాబు, నారా లోకేష్ కూటమి ఎంపీలు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ తీసేసి అక్కడ రాజధాని భవనాలు నిర్మాణం చేయాలని ఆలోచించిందన్నారు. స్వయంగా అప్పటి స్టీల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఈ విషయం వెల్లడించారని తెలిపారు. ఒక్కసారి సెయిల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ విలీనం చేస్తే అన్ని సమస్యలకు పరిష్కారం అవుతాయన్నారు. వైసిపి హయంలో అన్ని కల్తీ జరిగాయని, టీటీడీ విషయంలో సుప్రీం నిర్ణయం హర్షణీయమన్నారు. తిరుపతికి అన్య మతస్తులు ఎవ్వరు వచ్చిన విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాలని తెలిపారు.

40 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో రైవాడ పంచాయతీ శివారు శ్రీరామపురం జంక్షన్ వద్ద కారులో 40 కేజీలు గంజాయి తరలిస్తుండగా దేవరాపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై టి.మల్లేశ్వరరావు వారి సిబ్బంది కలిసి సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి కారులో తరలిస్తున్నారని ముందుస్తు సమాచారంతో శ్రీరాంపురం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేయడంతో అల్లూరి జిల్లా నుండి కారులో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 40 కేజీల గంజాయి, షిఫ్ట్ డిజైర్ కారు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో మోహన్ ఖైరావీ (29), పద్మన్ కిముండీ (27) వీరి ఇరువురు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు కాగా, మూడవ ముద్దాయి అతుల్ సోనీ ఉత్తరప్రదేశ్ రాష్టానికి చెందిన వాడు అని అన్నారు. అరెస్ట్ అయిన ముగ్గురు ముద్దాయిలను సోమవారం రిమాండ్‌కు తరలించామని దేవరాపల్లి ఎస్సై మల్లేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి

విశాలాంధ్ర - నక్కపల్లి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఒక మహిళ మృతి చెందిన సంఘటన నక్కపల్లి పట్టణంలోని ఉపమాక రహదారిలో గల ఒక కిరాణా షాప్ లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఉపమాక రహదారిలో నివాసం ఉంటున్న ఏ.లక్ష్మీనారాయణమ్మ (58) కిరాణా షాప్ నడుపు కుంటున్నారు. షాప్ ఉదయం తెరిచిన వెంటనే బయటికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గేటు ముట్టుకొనగా అప్పటికే తెగిపడి ఉన్న వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ కే.కుమార్ స్వామికి మృతురాలు కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహశీల్దార్‌ను కలిసిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర - నక్కపల్లి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన నక్కపల్లి మండల తహశీల్దార్ ఆర్.నరసింహమూర్తిని మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ముందుగా మండలానికి సంబంధించిన పలు విషయాలు ఆయనతో చర్చించారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో అయినంపూడి అప్పలరాజు, విక్కి శ్రీనివాసరావు, గంగరాజు, కోదండరావ్, ఎరుపల్లి శివాజీ, దార్ల కృష్ణ, ఎరుపల్లి అప్పలరాజు, శంకర్రావు, వై.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మొక్కుబడిగా అర్జీలు స్వీకరించవద్దు: గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు హాజరై వినతి పత్రాలు స్వీకరించారు. మండలం మొత్తం మీద 53 ఫిర్యాదులు అందాయని అందులో రెవెన్యూకు సంబంధించి 30, విద్యుత్ శాఖ 3, పంచాయతీ రాజ్ 18, విద్య 2 పలు సమస్యలపై ఫిర్యాదు పత్రాలు అందాయని మండల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు మాట్లాడుతూ అనేకమైన సమస్యలతో స్పందన కార్యక్రమానికి ఫిర్యాదులు వస్తాయని మొక్కుబడిగా కాకుండా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందని వారం వారం స్పందన కార్యక్రమం నిర్వహించి భీమిలిని ఆదర్శ నియోజవర్గంగా అభివృద్ధి చేయాలని అందులో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. బీపీ కల్లాలు రోడ్ల సమస్యలను వెంటనే సరిదిద్దాలని తెలిపారు. జూనియర్ కాలేజ్ స్థలం ఆక్రమణలో ఉన్నందున వెంటనే స్వాధీన పరుచుకొని హద్దులు వేయాలని, పీహెచ్‌సీని సిహెచ్‌సిగా మార్చాలని, రీ సర్వేలో పలు సమస్యలు, మొదలగునవి శాసనసభ్యులు ద ృష్టి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పేర్లి శ్యాం ప్రసాద్, ఎంపీడీవో డాక్టర్ జానకి, విద్యుత్ శాఖ జోన్-3 పోలాకి శ్రీనివాసరావు, నాయకులు ఎంపీపీ శారద ప్రియాంక, జనసేన ఇన్‌చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల, తాత్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు, మహంతి శివాజీ, పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

దళిత రైతుల భూములకు ఇబ్బందులు కలిగించవద్దు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో కుసులవాడ పంచాయతీ సర్వే నెంబరు 248లో ఆరుగురు దళిత రైతులకు సుమారు 15 ఎకరాల భూమిని 1998లో కేటాయించి నాటి నుండి పలు తోటలతో జీవనోపాధి పొందుతున్న తమను కొంతమంది తప్పుడు ఆరోపణలతో హెచ్చరిక బోర్డులు పెట్టి బెదిరిస్తున్నారని సోమవారం బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కుసులువాడ గ్రామం, యస్.సి. కాలనీ దళితులైన రవ్వ రామాయమ్మ, బొచ్చ అప్పయ్యమ్మ, కాకర వీరమ్మ, కుడితి కనకం, రవ్వ అప్పలనారాయణ, రవ్వ అప్పన్నలకు సర్వే నెం.248లో గల కొండ ప్రాంతంలో ఒక్కొక్కరికీ 2 ఎకరాల చొప్పున పొజిషన్ పత్రాలు జారీ చేశారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ సదరు భూమిలో జీడి మామిడి తోటలు వేసుకుని ఫలసాయం పొందుతున్నామని, సరైన ఆర్థిక పరిస్థితి, నీటి సదుపాయం లేనందున తోటలను సరైన పద్ధతిలో సంరక్షణ చేయలేకపోయామన్నారు. తోట ఫలసాయం బాగాలేనందున తోటలను తొలగించి మరలా క్రొత్త మొక్కలు వేయుట కొరకు భూమిని చదును చేశామని, కొంతమంది తప్పుడు ఆరోపణ కారణంగా తోటల పెంపకానికి అవరోధాలు ఏర్పడ్డాయన్నారు. కొండ ప్రాంతంలో పెరిగే నీలగిరి, సరుగుడు, జీడిమామిడి తోటలు వేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. కొండ ప్రాంతమైనందున సదరు తోటలు పెంపకం కొరకు వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేయించి, తమ భూములకు డి.పట్టా పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన కూటమి నేతలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబును వీరవిల్లి అగ్రహారం గ్రామ కూటమి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా వీరవల్లి గ్రామాభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందజేయాలని కోరారు.